క్లుప్తంగా

బైక్‌పై నుంచి పడి గాయాలు

రుద్రవరం: మండలంలోని టీ.లింగందిన్నె గ్రామ సమీపంలో శుక్రవారం మోటార్ సైకిల్ పైనుంచి కింద పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన నర్సయ్య ఆళ్లగడ్డకు వెళ్లి ఇంటికి చేరుకునే క్రమంలో గ్రామ సమీపంలో ప్రమాద వశాత్తు మోటార్ సైకిల్ అదుపుతప్పి కిందపడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం 108లో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నేడు రన్‌ఫర్ జీసస్ ర్యాలీ

నంద్యాల(న్యూటౌన్): ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం ఉదయం 6గంటలకు పట్టణంలో రన్‌ఫర్ జీసస్ నిర్వహిస్తున్నట్లు కో ఆర్డినేటర్ రవీంద్రపాల్, క్రిస్టియన్ వెల్ఫేర్ అండర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సభ్యులు కె.జోసెఫ్, పాస్టర్ అన్నాస్, ఏసుదాసు, ప్రెసిడెంట్ రవికుమార్ శుక్రవారం సాయంత్రం తెలిపారు. పెద్దచర్చి నుంచి ఉదయం 6 గంటలకు నంద్యాల డయాసిస్ ఇన్‌చార్జ్ బిషప్ ఐజక్ వరప్రసాద్ ప్రారంభిస్తారు. సంజీవనగర్ గేట్, శ్రీనివాససెంటర్, సాయిబాబానగర్, ఆర్‌ఎస్ రోడ్డు మీదుగా పెద్దచర్చి చేరుకుంటుందని వివరించారు.

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో కాళికాంబదేవి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా శ్రీకాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, వివిధ రకాల నిత్య పూజల తదనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. ఒడి బియ్యం కార్యక్రమం, పుష్పాభిషేకం చేపట్టి మహామంగళ హారతులు ఇచ్చారు. రాహుకాల పూజలు జరిపించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వక్ఫ్ ఆస్తులను కాపాడాలి

నంద్యాల(అర్బన్): నంద్యాలలోని ఆక్రమిత వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడాలని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూనిస్, జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాబ్‌బాషా కోరారు. ప్రస్తుతం ఆక్రమిత వక్ఫ్ ఆస్తుల విలువ దాదాపు రూ.వెయ్యి కోట్ల వరకు ఉంటుందని, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడుతూ తప్పుడు సర్వే నంబర్లు, ఎల్‌టీసీ, కొందరు మున్సిపల్ అధికారుల సహకారంతో భూములను కబ్జా చేసి బిల్డింగ్‌లు, వెంచర్లుగా వేశారన్నారు. ఆక్రమిత భూముల్లో నంద్యాలకు చెందిన 18వేల ముస్లిం కుటుంబాలకు ఇళ్లు కట్టించి ఇవ్వవచ్చని చెప్పారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి


మృతి చెందిన గొర్రె పిల్లలు

చాగలమర్రి: వీధి కుక్కల దాడిలో 13 గొర్రె పిల్లలు మృతి చెందిన సంఘటన శుక్రవారం గొడిగనూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మబ్బు వీరన్న అనే రైతు గొర్రెలను ప్రతి రోజులాగే మేపుకొని తిరిగి ఇంటికి వస్తుండగా గ్రామ శివారులో ఒక్కసారిగా వీధి కుక్కల గుంపు గొర్రెల మందపై దాడి చేశాయి. దాడిలో సుమారు 13 గొర్రె పిల్లలు మృత్యువాత పడ్డాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

అంతర్జాతీయ చెస్ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): అంతర్జాతీయ చెస్ పోటీలకు నంద్యాల సంకల్ప ఒలంపియాడ్ విద్యార్థులు ఎంపికయ్యారని స్కూల్ చైర్మన్ సుధాకర్, జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి రామసుబ్బారెడ్డి శుక్రవారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఈనెల 28న నంద్యాల జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహించి మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన హర్షవర్ధన్‌ఆచారి, అదానన్ అమీన్, షాలిం, మణికుమార్‌ను ఏప్రిల్ 25 నుంచి 30వ తేదీ వరకు విజయవాడలో జరిగే అంతర్జాతీయ ఫిడే రేటింగ్ పోటీలకు ఎంపిక చేశారని చెప్పారు.

సమరోత్సాహం

- అధినేత రాకతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్తేజం
- నంద్యాల బహిరంగ సభకు లక్షలాదిగా కదిలిన ప్రజలు
- జనసందోహాన్ని చూసి వైఎస్సార్ సీపీ విజయం లాంఛనమేనంటున్న విశ్లేషకులు
- మండుటెండను సైతం లెక్కచేయకుండా స్వచ్ఛందంగా హాజరైన జనం
- దీబగుంట్ల వద్ద ఎమ్మెల్యే శిల్పా రవి ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం


నంద్యాలలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురువారం నిర్వహించిన మేమంతా సిద్ధం సభకు హాజరైన ప్రజలు

సాక్షి, నంద్యాల: ఎన్నికల ప్రచారంలో భాగంగా మేమంతా సిద్ధం పేరుతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురువారం నంద్యాలలో నిర్వహించిన బహిరంగ సభకు జనం తండోపతండాలుగా తరలివచ్చారు. ఊహించిన దానికన్నా జనం తరలిరావడంతో సభ విజయవంతమైంది. దీంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో సమరోత్సాహం నెలకొంది. జిల్లాకు వచ్చిన తమ నేతను చూసేందుకు మండుటెండను సైతం లెక్క చేయకుండా వృద్ధులు, మహిళలు దారి పొడవునా వేచి చూశారు.

జనసంద్రంగా నంద్యాల..

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సభకు లక్షకు పైగా ప్రజలు తరలివచ్చినట్లు అంచనా. చామకాలువ సెంటర్ నుంచి డిగ్రీ కాలేజీ వరకు ఇసుకేస్తే రాలనంత మందితో కిక్కిరిసిపోయింది. బొమ్మలసత్రం ఫ్లై ఓవర్ కిటకిటలాడింది. బహిరంగ సభను చూసిన రాజకీయ పరిశీలకులు వైఎస్సార్ సీపీ విజయం లాంఛనమేనంటున్నారు.


మేమంతా సిద్ధం సభలో మాట్లాడుతున్న శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి

మునుపెన్నడూ లేనంత అభివృద్ధి..

నంద్యాలను జిల్లాగా ప్రకటించి ఈ ప్రాంత వాసుల చిరకాల వాంఛను జగనన్న నెరవేర్చారు. అలాగే దాదాపు రూ.500 కోట్లతో మెడికల్ కళాశాలను మంజూరు చేయగా ఇప్పటికే నిర్మాణం పూర్తిచేసుకొని తరగతులు జరుగుతున్నాయి. ఇక పట్టణంతో పాటు నియోజకవర్గంలో సీసీ రోడ్లు, సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, అర్బన్ హెల్త్ సెంటర్లు, పార్కుల ఆధునీకరణ, కుందూ నది వెడల్పు తదితర కార్యక్రమాలను దిగ్విజయంగా పూర్తి చేశారు.

ప్రజల బ్రహ్మరథం..

ఆళ్లగడ్డ నియోజకవర్గం నుంచి నంద్యాలలోకి అడుగుపెట్టిన సీఎం వైఎస్ జగన్‌కు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి కార్యకర్తలు, నాయకులతో కలిసి ఘన స్వాగతం పలికారు. జగనన్న ప్రయాణించిన దీబగుంట్ల నుంచి చాబోలు వరకు దారంతా జనంతో కిక్కిరిసిపోయింది. జగనన్నకు అడుగడుగునా జనం బ్రహ్మరథం పట్టారు.


సభలో యువతి ఉత్సాహం

సభను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు

నంద్యాలలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మేమంతా సిద్ధం సభను విజయవంతం చేసిన చేసిన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సభ విజయవంతంపై శుక్రవారం ఆయన మాట్లాడుతూ సభకు లక్ష మందికి పైగా ప్రజలు తరలివచ్చారన్నారు. మా దమ్ము, ధైర్యం సీఎం జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని చెప్పారు. రెండేళ్లు కరోనా ఉన్నప్పటికీ.. కేవలం మూడేళ్లలోనే జిల్లా కేంద్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపామన్నారు. మెడికల్ కళాశాల ఏర్పాటుతో పాటు ప్రభుత్వ పెద్దాస్పత్రిలో మెరుగైన వసతులు కల్పించామన్నారు. నంద్యాల ప్రజల దాహార్తిని శాశ్వతంగా తీర్చడానికి రూ.154 కోట్ల అమృత్ పథకం నిధులతో పనులు పూర్తి చేయించామన్నారు. పేదలందరికీ ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు మంజూరు చేశామన్నారు. మరికొద్ది రోజుల్లో జరగనున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించనుందని స్పష్టం చేశారు.

ఉపవాసంతో పుణ్యఫలం


చాగలమర్రిలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న గంగుల ప్రభాకర్‌రెడ్డి

చాగలమర్రి: పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస ఉండటం ఎంతో పుణ్య ఫలమని జలవనరుల ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక చక్రం కాంప్లెక్ వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుడు ముల్లా.షబ్బీర్ ఆహమ్మద్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. అలేగా ప్రత్యేక ప్రార్థనలో పాల్గొని పలువురు ముస్లింలకు పండ్లు తినిపించి ఉపవాస దీక్షను విరమింపజేశారు. ఇమాం మౌలానా అబ్దుల్ మజీద్ ఆరిఫ్‌తో పాలు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర


పాదయాత్రగా తిరుమలకు వెళ్తున్న తెలంగాణవాసులు

శిరివెళ్ల: మండుటెండలను సైతం లెక్క చేయకుండా తెలంగాణవాసులు పాదయాత్రగా తిరుమలకు కాలినడకన బయలుదేరారు. గురువారం వారి యాత్ర శిరివెళ్ల మెట్టకు చేరుకుంది. జోగులాంబ జిల్లా రాజోలి మండలంలోని మూర్తిదిన్నె, తనగల, పింకుదొడ్డి, వడ్డెపల్లెకు చెందిన 15 మంది ఈ నెల 25న బయలుదేరారు. 65 ఏళ్ల వృద్ధుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ తమ గ్రామాల సుభిక్షం కోసం, వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని పాదయాత్రగా వెళ్తున్నామన్నారు. రోజుకు 45 నుంచి 50 కిలోమీటర్లు నడుస్తున్నామన్నారు.


పాల్గొన్న క్రైస్తవులు


శిలువ మోస్తున్న ఏసు పాత్రదారి మహేష్


ముళ్ల కిరీటధారి చెమటను తుడుస్తున్న తల్లి మరియ

మానవాళి కోసం క్రీస్తు ప్రాణత్యాగం

- భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- దైవ సందేశాన్ని వినిపించిన పాస్టర్లు

నంద్యాల(న్యూటౌన్): సమస్త మానవాళి పాప క్షమాపణ కోసం ఏసుక్రీస్తు శిలువపై ప్రాణత్యాగం చేశారని నంద్యాల పాస్టరేట్–2 చైర్మన్ రెవరెండ్ ఇమ్మానియేల్, జోయెల్, విజయ్‌కుమార్, హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్–1 డీనరీ చైర్మన్ జోసెఫ్, పాల్‌రాజారావు, మత్తయి ఆలయం డీనరీ చైర్మన్ నందం ఐజక్, ఆరోగ్యమాత ఆలయం పాస్టర్ మేస ప్రసన్నకుమార్, తెలుగు బాప్టిస్ట్ రక్షణాలయం గురువులు పేర్కొన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఉదయం 11 నుంచి 3గంటల వరకు క్రైస్తవులు ముగింపు ఉపవాస ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హోలీక్రాస్ కెథడ్రల్ చర్చితో పాటు హోసన్న, ఏసుకృప, సీయోను, వైఎస్సార్‌నగర్ క్రిస్టియన్ అసెంబ్లీ, తదితర ఆలయాల్లో పవిత్ర పార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా చర్చిల గురువులు ఏసు శిలువపై పలికిన ఏడు మాటలను ధ్యానం చేశారు. ప్రార్థనల్లో పాల్గొన్న వేలాది మంది భక్తులకు అన్నదాన ం, మజ్జిగ, నిమ్మరసం, శీతల పానీయాలు అందించారు. పాస్టరేట్–1 హోలీక్రాస్ కెథడ్రల్ ఆలయంలో జరిగిన ప్రార్థనల్లో ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి పాల్గొన్నారు.

చాగలమర్రి: ఏసు ప్రభువు ప్రజలందరి కోసం ప్రాణాలర్పించారని ఆ ప్రభువును స్మరించుకోవటానికి శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నామని ముత్యాలపాడు గ్రామంలోని పురాతనమైన ఎస్పీజీ చర్చిలో ఫాదర్ రెవ.ఆర్.ఎ.ఇ.సంజీవ్ రాజ్ పేర్కొన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా బైబిల్‌లోని 7 మాటలను చదవి వినిపించారు. అనంతరం షెఫర్డ్ యూత్ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. సంఘ పెద్దలు లూకా ప్రసాద్, గోడుగు ఏలియా, కామిరెడ్డి సువార్త, కొట్టాల దావీదు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని గ్రామాల్లో క్రైస్తవులు శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని మందిరాల్లో ఉపవాస దీక్షలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక చర్చిలో మత పెద్దలు ఏసు బోధనలు చేశారు. క్షమా గుణం కలిగి ఉండాలని,పోరుగు వారిని ప్రేమించాలని, దయా మయ జీవణం గడపాలని సూచించారు.

దొర్నిపాడు: గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు చర్చిల్లో శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. సమస్తమానవాళి కోసం క్రీస్తు సిలువ వేయబడిన సందర్భంగా క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను జరుపుకొంటారు. సిలువలో క్రీస్తు పలికిన ఏడు మాటలను గుర్తుచేసుకున్నారు.


గుడ్‌ఫ్రైడే వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా రవి


దైవసందేశం ఇస్తున్న జోయెల్


సందేశం వినిపిస్తున్న విక్టర్ విజయరాజు

ఉయ్యాలవాడ : మండలంలోని వివిధ గ్రామాల్లో వెలిసిన ప్రార్థన మందిరాల్లో శుక్రవారం క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలను జరుపుకున్నారు. ఆర్.పాంపల్లె, అల్లూరు, ఉయ్యాలవాడ ప్రార్థన మందిరాల్లో విక్టర్ విజయరాజు, సత్యరాజు, జోషి పాస్టర్లు పాల్గొని క్రీస్తు శిలువపై పలికిన 7 మాటల గురించి భక్తులకు వినిపించారు.


ఏసుక్రీస్తు వేషధారణలో శిలువపై భక్తుడు

గోస్పాడు: మండలంలోని గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ఆర్‌సీఎం చర్చిలో సెయింట్ ప్రాన్సిస్ యూత్ సభ్యులు లిటిల్ ఏంజల్ స్కూల్ నుంచి ఆర్‌సీఎం చర్చి వరకు నాటక రూపంలో శిలువ యాత్ర నిర్వహించారు.


ఏడు మాటలను వివరిస్తున్న సంజీవ్ రాజ్

నంద్యాల(అర్బన్): మండలంలో గ్రామాల్లో శుక్రవారం క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పోలూరు, పెద్దకొట్టాల, చాపిరేవుల గ్రామాల్లో క్రీస్తు ఏసు శిలువ మోసే సన్నివేశాలను ప్రదర్శించారు. చాపిరేవుల పునీత్ ఆంథోని ఆర్‌సీఎం చర్చి ఫాదర్ బాలకిశోర్ పర్యవేక్షణలో ఏసు శిలువ మోసే సన్నివేశంలో ఏసు పాత్రలో మహేష్ శిలువ మోసి అందరినీ మెప్పించారు.


ముత్యాలపాడులో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు


రుద్రవరంలో ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

నన్నెవరూ కొట్టలేదు

- అఖిలప్రియ వెంటనున్న వారు రమ్మంటేనే శిరివెళ్ల స్టేషన్ వద్దకు వెళ్లా
- అక్కడ తెల్లకాగితంపై వేలిముద్ర తీసుకున్నారు
- గంగుల ప్రభాకర్ రెడ్డిపై కేసును ఉపసంహరించుకున్న షబ్బీర్ వలి


షబ్బీర్‌వలి

ఆళ్లగడ్డ: బస్సు యాత్రలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం యర్రగుంట్లలో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమం వద్ద తనను గంగుల ప్రభాకర్ రెడ్డి కొట్టారని చెప్పడం అబద్ధమని షబ్బీర్ వలి శుక్రవారం తెలిపాడు. సమావేశ శిబిరం దగ్గర అఖిలప్రియ హడావుడి చేసేందుకు యత్నించగా సర్దిచెప్పిన పోలీసులు ఆమెను అక్కడి నుంచి శిరివెళ్ల సర్కిల్ కార్యాలయానికి తరలించిన విషయం తెలిసిందే. అయితే అక్కడ ఆమె వెంట వచ్చిన షబ్బీర్‌వలి అనే వ్యక్తితో తెల్లకాగితంపై వేలిముద్ర వేయించుకుని సీఎం సమావేశ శిబిరం వద్దకు వెళ్తుంటే తనపై రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి దాడి చేశాడని ఫిర్యాదు చేశారు. ఈ విషయం శుక్రవారం ఉదయం షబ్బీర్ వలికి తెలియడంతో వెంటనే స్టేషన్‌కు చేరుకుని.. తనను ఎవరూ కొట్టలేదని, ఫిర్యాదు విత్‌డ్రా చేసుకుంటున్నానని పోలీసులకు రాతపూర్వకంగా రాసిచ్చారు. ఆయన మాట్లాడుతూ తాను జగనన్నను చూడటానికి వేచి ఉండగా.. 'అఖిలప్రియ వచ్చినప్పుడు అలజడి జరుగుతుంటే చూసేందుకు వెళ్లగా.. అంతలో పోలీస్ స్టేషన్‌కు వెళ్తున్నాం.. అక్కడేం జరుగుతుందో చూద్దాం.. రమ్మని ఆమె వెంట ఉన్నవారు నన్ను పిలుచుకెళ్లారు. అక్కడ తనతో తెల్ల కాగితంపై వేలిముద్ర వేయించుకున్నారు. ఆ తరువాత ఏం జరిగిందో నాకు తెలియదు. నన్ను ఎవరూ కొట్టలేద'ని చెప్పాడు. తాను పూలు అమ్ముకుని జీవించేవాడినని, తనకు రాజకీయాలతో సంబంధం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.


క్రిష్టిపాడులో నిండుగా గేరుమాను కుంట

నిండు కుండలా..

దొర్నిపాడు: తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా నదులు, రిజర్వాయర్లు అడుగంటడంతో కుందూనది నీటి చుక్క లేక వెలవెలబోతోంది. గతంలో కేసీ కాలువకు సాగునీరు వదలడంతో మండలంలోని క్రిష్టిపాడు గ్రామ శివారులోనున్న గేరుమాను కుంటను నింపారు. ప్రస్తుతం కుంట నిండుకుండను తలపిస్తోంది. గ్రామస్తుల నిత్యావసరాలకు ఈ నీరు ఉపయోగపడుతున్నాయి. నీటి ఎద్దడిని ముందుగానే గ్రహించిన రైతులు కుంటను నింపుకోవడంతో ప్రస్తుతం నీటి ఇక్కట్లు తప్పాయి.

వారికి విధులు కేటాయించొద్దు


మాట్లాడుతున్న హృదయరాజు

నంద్యాల(న్యూటౌన్): దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు, కార్యదర్శి నగరి శ్రీనివాసులు ఉన్నతాధికారులను కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మే నెలలో జరిగే సాధారణ ఎన్నికల విధుల నుంచి పదవీ విరమణ పొందే ఉపాధ్యాయులు, చంటి బిడ్డ తల్లులు, గర్భిణులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందికి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు మాధవస్వామి, సాంబశివుడు, పుల్లయ్య, పవన్‌కుమార్, మునిస్వామి, రవి, వెంకటేశ్వర్లు, గోపాల్‌రావు, జయరాం, ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే వస్తువులు విక్రయించాలి

- ఈఓ డి.పెద్దిరాజు


దుకాణదారులతో మాట్లాడుతున్న దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, సీఐ ప్రసాదరావు

శ్రీశైలంటెంపుల్: ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల క్షేత్ర పరిధిలోని దుకాణదారులు ఎమ్మార్పీకే వస్తువులను విక్రయించాలని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణ అధికారి డి.పెద్దిరాజు సూచించారు. శుక్రవారం దేవస్థాన పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో క్షేత్ర పరిధిలోని దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 6 నుంచి 10వ తేదీ వరకు జరగనున్న ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని కర్ణాటక, మహారాష్ట్ర నుంచి లక్షల సంఖ్యలో భక్తులు క్షేత్రాన్ని సందర్శిస్తారన్నారు. దుకాణదారులు భక్తులతో మర్యాదగా మెలగాలన్నారు. దుకాణదారులు, హోటల్ నిర్వాహకులు శుచీ, శుభ్రతలను పాటించాలన్నారు. ఆహార పదార్థాలపై, తినుబండరాలపై తప్పనిసరిగా మూతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దుకాణాల వద్ద వస్తువుల ధరల పట్టికను ప్రదర్శించాలన్నారు. శ్రీశైలం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు మాట్లాడుతూ దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో శ్రీశైలం ఎస్ఐ లక్ష్మణరావు, దేవస్థాన రెవెన్యూ ఏఈఓ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ


అలంకరణలో అంకాళమ్మ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం ఊయలసేవ నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే శ్రీశైలగ్రామ దేవత అంకాళమ్మకు విశేషపూజలు నిర్వహించారు.

పల్లకీలో విహరించిన మహానందీశ్వర దంపతులు


మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వర శర్మ, శాంతారాంభట్, హనుమంతు శర్మ, అర్చకులు మహానందీశ్వర స్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. పల్లకీలో కొలువైన స్వామి, అమ్మవార్లకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, హారతిపూజలు, అలంకార, ఉత్సవ పూజలు నిర్వహించారు. బలిహరణ పూజలు చేసిన అనంతరం ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం వైభవంగా జరిగింది. పలు ప్రాంతాల భక్తులు ఉత్సవంలో పాల్గొని స్వామివారి పల్లకీని మోస్తూ ఓం నమో మహానందీశ్వరాయ అంటూ భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

ఏప్రిల్ 1న కబడ్డీ పోటీలు

పాములపాడు: ఈస్టర్ సందర్భంగా మండలంలోని వేంపెంట గ్రామంలో ఏప్రిల్ 1న సీనియర్ ఓపెన్ కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు భాస్కర్, శ్యామ్ శుక్రవారం తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.30,000 (దాత శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి), రెండవ బహుమతి రూ.20,000 (దాత వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ధారా సుధీర్), మూడవ బహుమతి రూ. 15,000(దాత జెడ్పీటీసీ జ్యోతి రామలింగేశ్వరరెడ్డి), నాల్గవ బహుమతి రూ.10,000(దాత తుమ్మలూరు సర్పంచు వరప్రసాదరావు) ఇవ్వనున్నట్లు చెప్పారు. పోటీలు ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 8790408681, 8125491828, 9014716286, 9963588173 నంబర్లను సంప్రదించాలన్నారు.

అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి శుక్రవారం విజయవాడకు చెందిన పాలసాల పద్మావతి కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఆలయ పర్యవేక్షకురాలు టి.హిమబిందుకు నగదు అందజేశారు. దాత కుటుంబానికి స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.